## క్లుప్తంగా

### నూతన ఆటోలు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక బంగారుపేట ఎస్వీకే యువసేన వారి ఆరు నూతన ఆటోలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసం వద్ద శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో వెంకటకృష్ణప్రసాద్ స్వయంగా ఆటోలను నడిపి ప్రారంభించారు. ఆటో యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. తమకు అండగా నిలిచిన వెంకటకృష్ణప్రసాద్‌కు ఆటో యజమానులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### 90శాతం పింఛన్లు పంపిణీ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని ఎంపీడీవో రమేష్‌బాబు శనివారం తెలిపారు. గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తుండగా, సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. మండలంలో 90 శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వివరించారు.

### రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



నందిగామ: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీవో ఎం.పద్మావతి తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం నందిగామ పట్టణంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీవో పద్మావతి మాట్లాడుతూ వాహనాలు నడిపే వారంతా తప్పనిసరిగా రహదారి భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎంవీఐ ఎంవీఎస్ రాజు, ఏవో ప్రభాకరలింగం, సిబ్బంది, పలు డ్రైవింగ్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న సంగీత కచేరీలు

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు సంగీత కళాశాలలో ఆరో రోజు అత్యంత వైభవంగా సాగాయి. శనివారం నాటి కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు వేమూరి విశ్వనాథ్, అంజనా సుధాకర్, పసుమర్తి పావని, గుండూరి సాయి కృష్ణ కౌశిక్, కృష్ణప్రియ, పద్మశ్రీ, కే అంజనా సుగాత్రి, పీ జయతి, లంక తేజస్వి త్యాగరాజ స్వామి రచించిన త్యాగరాజ స్వామి కృతులను గానం చేశారు. శివానీ, హనుమంతరావు, గండూరి శ్రీనివాస మూర్తి, ఆర్. సుధాకర్ వాద్య సహకారం అందించారు. సంగీత సన్మండలి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ ఆఖరిరోజైన ఆదివారం ఉదయం త్యాగరాజ స్వామి రచించిన పంచరత్న కృతుల గోష్టి గానం ఉంటుందని తెలిపారు. రాత్రి 8 గంటలకు ఉత్సవ సంప్రదాయ కీర్తనలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, ఉపాధ్యక్షుడు జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, కోశాధికారి గండూరి రమాసత్యనారాయణ పాల్గొన్నారు.

# సిద్ధం సభకు తరలిన జగనన్న సైన్యం



సిద్ధం సభకు వెళ్తున్న వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల నాయకులు, కార్యకర్తలతో విప్ ఉదయభాను



పెండ్యాలలో జెండాఊపి బస్సును ప్రారంభిస్తున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



నందిగామ నుంచి సిద్ధం సభకు వెళ్తున్న నాయకులు, అభిమానులు



పేట నుంచి సభకు బయలుదేరిన మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నాయకులు

పెనుగంచిప్రోలు: రాష్ట్రానికి మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. దెందులూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం నిర్వహించిన సిద్ధం సభకు పెనుగంచిప్రోలు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి సభకు వెళ్తున్న కార్యకర్తలకు నవాబుపేట క్రాస్‌రోడ్స్ వద్ద ఎమ్మెల్యే ఉదయభాను స్వాగతం పలికి జాగ్రత్తలు చెప్పారు. ఈసందర్భంగా ఉదయభాను విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు ప్రజలంతా మద్దతుగా ఉన్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా..జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని జనం సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామాల నుంచి ప్రజలంతా స్వచ్ఛందంగా సిద్ధం సభకు తరలిరావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సిద్ధం సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్ తదితరులు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, పార్టీ జిల్లా ఎస్సీసెల్ నాయకులు గుజ్జర్లపూడి వడ్డీకాసులు, సర్పంచి వేల్పుల పద్మకుమారితోపాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, భారీసంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు.



సిద్ధం సభకు వెళ్తున్న వారిని పలకరిస్తూ జాగ్రత్తలు చెబుతున్న విప్ ఉదయభాను

**చిల్లకల్లు నుంచి..**

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరులో నిర్వహించిన సిద్ధం భారీ బహిరంగసభకు మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల నుంచి బస్సులలో తరలివెళ్లారు. వాహనాలకు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు కట్టుకుని సందడి వాతావరణంలో దెందులూరుకు బయలుదేరి వెళ్లారు.

**వత్సవాయి మండలంలో..**

వత్సవాయి : దెందులూరు సిద్ధం సభకు వత్సవాయి మండలం నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు శనివారం పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. వత్సవాయి నుంచి మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, గ్రామపార్టీ రంగిశెట్టి ముత్తయ్య, సర్పంచి భూక్యా సీతమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, పోలంపల్లి నుంచి సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవి, దబ్బాకుపల్లి నుంచి సర్పంచి కొట్టి నగేష్, సయ్యద్‌బాబు, పందగ శ్రీను, చిట్టేల నుంచి మారెళ్ల పుల్లారెడ్డి బ్రదర్స్, మక్కపేట నుంచి కనగాల రమేష్, సర్పంచి గుడేటి శారమ్మ, భీమవరం నుంచి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకటరెడ్డి, గుండం రంగారెడ్డి, మంగొల్లు నుంచి సర్పంచ్ అన్నెపాక ప్రణీత, నరసింహారావు, సొసైటీ అధ్యక్షులు సామినేని లక్ష్మీనారాయణ, కన్నెవీడు నుంచి సర్పంచి చావా దుర్గారాణి, కంభంపాడు నుంచి వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, నరాల మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



వత్సవాయి నుంచి సభకు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

**జగ్గయ్యపేట పట్టణంలో..**

జగ్గయ్యపేట అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరులో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సిద్ధం భారీ బహిరంగ సభకు జగ్గయ్యపేట పట్టణం నుంచి వేలాది మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు తరలివెళ్లారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పిలుపుమేరకు జగ్గయ్యపేట పట్టణంతోపాటు జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలు, నందిగామ మండల పరిధిలోని ఏటిపట్టు గ్రామాల నుంచి 75 బస్సులు, 30కార్లు ఇతర వాహనాల్లో సుమారు 5వేల మందికి పైగా అభిమానులు తరలివెళ్లినట్లు సమాచారం. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల క్రీడా మైదానంలో నుంచి బయలుదేరుతున్న బస్సులను ఎమ్మెల్యే ఉదయభాను జెండాఊపి ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.



మోగులూరు నుంచి సభకు తరలివెళ్తున్న వైస్ ఎంపీపీ మల్లికార్జునరావు, నాయకులు

**నందిగామ మండలం నుంచి..**

నందిగామ: ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం జరిగిన సిద్ధం భారీ బహిరంగసభకు నందిగామ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి 85 ప్రత్యేక బస్సులు, 49కార్లు, మరికొందరు అభిమానులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాలలో వేలాదిమంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఆపార్టీ నాయకుల పర్యవేక్షణలో కార్యకర్తలు బహిరంగసభకు తరలి వెళ్లారు. గ్రామాల్లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలలో ప్రత్యేక జోష్ కనిపించింది.

**కంచికచర్ల మండలంలో..**

కంచికచర్ల : దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు కంచికచర్ల మండలం నుంచి శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్‌తోపాటు ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవడం ఓ బాధ్యతగా పేర్కొంటూ ప్రతి గ్రామం నుంచి అధికసంఖ్యలో జనం తరలివెళ్లారు.

**వీరులపాడు మండలంలో..**

వీరులపాడు: ఏలూరు సమీపంలోని దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నిర్వహించిన సిద్ధం భారీ బహిరంగసభకు మండలం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లలో తరలి వెళ్లారు.



పెనుగంచిప్రోలులో సర్పంచి పద్మకుమారి ఆధ్వర్యంలో తరలివెళ్తున్న కార్యకర్తలు



చిల్లకల్లు నుంచి సిద్ధం సభకు తరలుతున్న పార్టీ శ్రేణులు



వీరులపాడు మండలం జయంతి గ్రామం నుంచి సభకు వెళ్తున్న గ్రామస్తులు

## ముగిసిన జిల్లాస్థాయి పోటీలు

విజయవాడస్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా ఎన్టీఆర్ జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. క్రికెట్, బ్యాడ్మింటన్(డబుల్స్), వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు ఇందిరా గాంధీ మునిసిపల్ కార్పొరేషన్, దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు నియోజకవర్గాల జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించాయి. క్రికెట్ పురుషుల విభాగంలో విజయవాడ తూర్పు, విజయవాడ సెంట్రల్, జగ్గయ్యపేట జట్లు, మహిళల విభాగంలో విజయవాడ తూర్పు, సెంట్రల్, తిరువూరు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. కబడ్డీ పురుషుల విభాగంలో జగ్గయ్యపేట, విజయవాడ తూర్పు, నందిగామ, మహిళల విభాగంలో మైలవరం, విజయవాడ సెంట్రల్, తిరువూరు, బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో విజయవాడ తూర్పు, తిరువూరు, నందిగామ, మహిళల విభాగంలో జగ్గయ్యపేట, విజయవాడ సెంట్రల్, విజయవాడ పశ్చిమ, వాలీబాల్ పురుషుల విభాగంలో విజయవాడ సెంట్రల్, మైలవరం, నందిగామ, ఖోఖో పురుషుల విభాగంలో నందిగామ, తిరువూరు, మైలవరం, మహిళల విభాగంలో విజయవాడ పశ్చిమ, తిరువూరు, విజయవాడ సెంట్రల్ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి సాధించినట్లు డీఎస్‌డీఓ ఎస్.ఎ.అజీజ్ తెలిపారు. వాలీబాల్ మహిళల విభాగంలో మైలవరం, విజయవాడ సెంట్రల్ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచాయని వివరించారు.విజేతలకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఏఓ పి.రామకృష్ణ ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.



కబడ్డీ క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

## శాంతిభద్రతలపై డీసీపీ సమీక్ష

నందిగామ: విజయవాడ రూరల్ డీసీపీ కంచి శ్రీనివాసరావు నందిగామ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో శనివారం సాయంత్రం ఏసీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలో శాంతిభద్రతలపై చర్చించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్య, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీసీపీ శ్రీనివాసరావు

## పోక్సో కేసు నమోదు

కంచికచర్ల : ఓ మైనర్ బాలికపై మైనర్ బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పీ చంద్రశేఖర్ కథనం మేరకు కంచికచర్ల మండలం మోగులూరులో ఏడేళ్ల ఓ మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన 14ఏళ్ల మైనర్ బాలుడు ఈనెల ఒకటో తేదీ ఉదయం సమయంలో బడ్డీకొట్టు నుంచి ఇంటివద్ద దిగబెడతానని బైక్‌పై ఎక్కించుకుని మార్గంమధ్యలో బాలికపై అత్యాచారానికి యత్నించాడు. ఆ సమయంలో బాలిక కేకలు వేయడంతో బాలుడు పరారయ్యాడు. ఈ విషయం బాలిక ఇంటికి వెళ్లి నాయనమ్మకు తెలియజేయగా ఆమె కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేయడంతోపాటు బాలుడిని అరెస్ట్ చేసి శనివారం నందిగామ కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

## నేడు సచివాలయం ప్రారంభం

పెనుగంచిప్రోలు: మండలంలోని శనగపాడులో ఆదివారం ఉదయం 11గంటలకు గ్రామసచివాలయం భవన ప్రారంభోత్సవం, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మార్కపూడి గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పెనుగంచిప్రోలులోని తంబరేణి గార్డెన్స్‌లో వైఎస్సార్ ఆసరా కింద మహిళలకు చెక్కుల పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.



## ఆటోలకు నంబరు స్టిక్కర్ల ఏర్పాటు

నందిగామ: ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోల పూర్తి వివరాలను సేకరించడంతోపాటు ప్రతి ఆటోకు పోలీసులు ఓ నంబరును కేటాయిస్తూ స్టిక్కర్లను అంటించారు. ఈసందర్భంగా హనీష్ మాట్లాడుతూ ఇలా ఆటోలకు నంబరు కేటాయించడం ద్వారా ప్రయాణికులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా ఆటోలో ఏవైనా వస్తువులు మర్చిపోయినా, ప్రయాణికులకు ఏమైనా ఇబ్బంది కలిగినా వెంటనే స్టిక్కర్‌పై ఉన్న నంబరును గుర్తించుకుని పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఆటోను గుర్తించడం సులభమవుతుందని వివరించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్ పాల్గొన్నారు.



ఆటోలకు నంబరు స్టిక్కర్లు అంటిస్తున్న ఇన్‌స్పెక్టర్ హనీష్, ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్

## నిందితులను శిక్షించాలని డిమాండ్



నందిగామ: విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్ రమణయ్యను హత్యచేసినవారిని వెంటనే కఠినంగా శిక్షించాలని రెవెన్యూ ఉద్యోగులు డిమాండ్ చేశారు. నందిగామ ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు మాట్లాడుతూ తహసీల్దార్ హత్యకు గురికావడం బాధాకరమన్నారు. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.




## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నందిగామ: సైబర్ నేరాల బారినపడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్స్పెక్టర్ హనీష్ సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో నందిగామ పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని అడవిరావులపాడు గ్రామస్తులకు శనివారం రాత్రి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హనీష్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పకూడదని, సంబంధంలేని ఫోన్ లింకులను ఓపెన్ చేయకూడదని సూచించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు కార్యక్రమంలో ఎస్సై పండు దొర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కబడ్డీలో ప్రతిభచూపిన కీసర జట్టు



కంచికచర్ల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో కంచికచర్ల మండలంలోని కీసర జట్టు మూడోస్థానంలో నిలిచింది. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న పోటీల్లో కీసర జట్టు, మైలవరం జట్టుపై గెలిచి జిల్లాస్థాయిలో తృతీయ బహుమతిని సాధించడంపై గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు. జట్టు సభ్యులను అభినందించారు.

